పరీక్ష తప్పిన టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పార్వతీపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పరీక్ష తప్పిన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు ఈ నెల 28 నుంచి పార్వతీపురంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఫెయిలైన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను తప్పకుండా పార్వతీపురంలోఅడ్మిట్ చేయించాలని ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. బాలురు, బాలికల కోసం వేర్వేరుగా కోచింగ్, వసతి కల్పించామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిహారం కోసం ఎదురుచూపు


రిజర్వాయర్ కోసం సేకరించిన భూములు

- సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులు
- ఐదేళ్లు గడిచినా దక్కని నష్టపరిహారం
- స్పందించని గత వైసీపీ ప్రభుత్వం
- ఏటా బ్యాక్ వాటర్‌తో ముప్పు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు


సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాంతం

భామిని, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వంశధార వరద కాలువ పనులు ఏ ముహూర్తాన ప్రారంభించారో గాని రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం భూములిచ్చిన వారికి తీవ్ర అన్యాయం జరిగింది. ఐదేళ్లు గడిచినా వారికి నష్టపరిహారం అందలేదు. దీనిపై గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మరోవైపు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో ఏటా రైతులు తమ పంటలను నష్టపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా 2006లో సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం 163 ఎకరాలను సేకరించి.. దీనికి తూర్పు వైపు గట్టు నిర్మించారు. కాట్రగడ నుంచి వరద కాలువ ద్వారా ప్రవహించిన వంశధార వరదనీరు బ్యాలెన్స్ రిజర్వాయర్‌లో కొంతమేర నిలుపుదల చేయాలని భావించారు. ఈ మేరకు దాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ లోగా ఒడిశా రాష్ట్ర అభ్యంతరాలతో ఆ పనులు నిలిచిపోయాయి. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో హిరమండలం రిజర్వాయర్‌కు వరదనీరు మళ్లించారు. దీంతో సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి బ్యాక్ వాటర్ పోటెత్తింది. ఎగువన ఉన్న రైతులకు చెందిన వరి, పత్తి పంటలు ముంపునకు గురయ్యాయి. అప్పట్లో అధికారులు వాటిని

(మిగతా 8వ పేజీలో...)


బ్యాక్ వాటర్ పోటెత్తడంతో ముంపునకు గురైన పొలాలు (ఫైల్)

జమ చేస్తాం..

నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వానికి నివేదించాం. తాజాగా కూటమి సర్కార్ దృష్టికి తీసుకెళ్లాం. సుమారు రూ. ఏడు కోట్లు చెల్లించాల్సి ఉంది. ఏయే రైతుకు ఎంతెంత పరిహారం అందిస్తామనేది ఇప్పటికే తెలియజేశాం. ప్రభుత్వం ఈ పరిహారాన్ని విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాలో జమ చేస్తాం.

- లీనా, యూనిట్-4 స్పెషల్ డీటీ

కూటమిదే పాలకొండ

- నగర పంచాయతీ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్న వైనం
- చైర్‌పర్సన్‌గా మల్లీశ్వరి ఎన్నిక
- వీడిన ఉత్కంఠ

పాలకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికలో కూటమి పై చేయి సాధించింది. కోరం లేక ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరగడంతో ఉత్కంఠకు తెరపడింది. చైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి ఎన్నికయ్యారు. పట్టణంలో 19వ వార్డుకు చెందిన రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. చైర్‌పర్సన్ పీఠం ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో రెండో వార్డుకు చెందిన ఆకుల మల్లీశ్వరికి ఆ పదవి దక్కుతుందని అంతా భావించారు. అయితే ఆమె వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో సీన్ మారింది. మరోవైపు సంఖ్యా బలం ఉన్న వైసీపీ కౌన్సిలర్లు రెండుసార్లు సమావేశానికి హాజరుకాక పోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. చివరకు సోమవారం మరోసారి ఎన్నిక జరగగా చైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి ఎన్నికయ్యారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఎమ్మెల్యేతో పాటు మల్లీశ్వరి, టీడీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, జనసేనలో చేరిన కౌన్సిలర్ గంగునాయుడు నగర పంచాయతీకి చేరుకున్నారు. ఆకుల మల్లీశ్వరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ శోభికకు తెలియజేశారు. టీడీపీకి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ అడపా జయ దానిని ప్రతిపాదించారు. 20వ వార్డు కౌన్సిలర్ గంట వరలక్ష్మి ఆమోదించారు. దీంతో చైర్‌పర్సన్‌గా మల్లీశ్వరిని ఎన్నికల అధికారి ప్రకటించారు.


చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మల్లీశ్వరికి అభినందనలు తెలుపుతున్న మంత్రి , ఎమ్మెల్యే తదితరులు

వైసీపీ తరఫున బీఫారం

వైసీపీ పట్టణ అధ్యక్షుడు మన్మథరావు, సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు మల్లీశ్వరికి పార్టీ తరఫున బీఫారం కూడా ఎన్నికల అధికారికి అందించారు. విప్ కూడా జారీ చేశారు. అయితే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని మల్లీశ్వరి చెప్పినప్పటికీ ఎలా ఆమోదించారని వైసీపీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఎన్నిక ప్రక్రియలో నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా విజయం మాదే: మంత్రి సంధ్యారాణి

వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా కూటమి ఖాతాలోనే పాలకొండ చేరిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయానికి చేరుకుని చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరికి అభినందనలు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు చైర్‌పర్సన్ ఎన్నిక జరగకుండా వైసీపీ చేసిందన్నారు. అయితే కూటమి అభివృద్ధిని చేసి కౌన్సిలర్లు కూడా తమ వైపు వస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఎన్ని అడ్డంకులు పెట్టినా విజయం సాధించామని తెలిపారు. అంతకముందు అంతకముందు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ క్యాంప్ కార్యాలయంలో కూటమి నేతలతో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చర్చలు జరిపారు. అరకు పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ , సీనియర్ నేత పల్లా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఈవో వచ్చేదెప్పుడో?

- మాన్సాస్ ఈవోకు అదనంగా పైడిమాంబ దేవస్థానం బాధ్యతలు



విజయనగరం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయగరం పైడిమాంబ దేవస్థానానికి కొన్ని నెలలుగా రెగ్యులర్ ఈవో(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) నియామకం జరగడం లేదు. గత ఏడాది ఉయ్యాల కంబాల ఉత్సవం తరువాత అప్పటి ఈవో ప్రసాద్ అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. కొద్ది నెలల కిందట మాన్సాస్ ఈవో ప్రసాద్ రావును తాత్కాలికంగా పైడిమాంబ దేవస్థానానికి నియమిం చారు. అయితే మాన్సాస్ సంస్థ పనుల ఒత్తిడి వల్ల ఆయన దేవస్థానంలో విధులకు సమయం కేటాయించలేకపోతున్నారు. ఆయన సంతకం కావాలంటే పైడి మాంబ దేవస్థానం సిబ్బంది కోటలోని ఆయన కార్యాలయానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో ఇన్‌చార్జి ఈవో కారణంగా కీలక పనులపై నిర్ణయం తీసుకోవడం లేదు. పైడిమాంబ సిరిమానోత్స వానికి నాందిగా నిలిచే దేవర ఉత్సవానికి(వచ్చే నెల12న) సమయం దగ్గరపడుతోంది. విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. రెగ్యులర్ ఈవో లేకపోవడం వల్ల నిర్ణయాలు వేగంగా తీసుకోలేని పరిస్థితి. మే 2 తరు వాత ఏ రోజైనా ధర్మకర్తల మండలి నియామక ప్రక్రియ, ప్రమాణ స్వీకారం తదితర ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. పైడిమాంబ ఆలయ విస్తరణకు వచ్చేనెల తొలి వారంలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వాటి పరిశీలనకు రెగ్యులర్ ఈవో ఉండాలి. మరి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో జిల్లాకు నిరాశ

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన విజయనగరానికే ప్రాధాన్యం



పార్వతీపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల మంజూరులో జిల్లాకు ప్రాధాన్యం దక్కలేదు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విజయనగరం జిల్లాకు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ రెండు పదవుల్లో ఏదో ఒకటి తమకు వస్తుందని ఆశించిన జిల్లా సీనియర్ నేతలకు నిరాశే మిగిలింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో కొంతమంది టీడీపీ నాయకులపై రౌడీషీట్‌లను కూడా వైసీపీ నాయకులు ఓపెన్ చేయించారు. తప్పుడు కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అయితే పార్టీ కోసం ఇలా ఎన్నో కష్టాలు పడిన జిల్లా నేతలను గుర్తించకుండా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కేవలం విజయనగరం జిల్లాకే నామినేటెడ్ పోస్టులు కేటాయించడాన్ని ద్వితీయశ్రేణి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు పదవులు కేటాయించకుండా అధిష్ఠానం మొండి చేయి చూపిందని కొంతమంది తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధిష్ఠానం జిల్లాను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- జాయింట్ కలెక్టర్ శోభిక

పాలకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శోభిక హెచ్చరించారు. గొట్టమంగళాపురం, చిన్న మంగళాపురంలో ఇసుక రీచ్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. స్టాక్ పాయింట్లు, వాటి వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మైనింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక రీచుల్లో తవ్వకాలు చేపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. తవ్వకాలు, రవాణా ఇతర వివరాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న జేసీ, సబ్ కలెక్టర్ తదితరులు

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి


సిమ్మన్న (ఫైల్)

భామిని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన పాలవర్తి సిమ్మన్న (62) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పరికరాలు, కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు సానపడుతూ సిమ్మన్న జీవనం సాగిస్తుంటాడు. సోమవారం ఆ పని మీద కొత్తగూడ వెళ్లాడు. అయితే స్వగ్రామానికి తిరిగొస్తున్న సమయంలో భారీ వర్షం కురిసింది. కొత్తగూడ-మాసగూడ మధ్య పిడుగుపడింది. దీంతో అక్కడిక్కడే వృద్ధుడు మరణించాడు. వంశధార వరద కాలువ పక్కన అచేతనంగా పడి ఉన్నట్టు తెలుసుకున్న కుమారులు రమేష్, సురేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తండ్రి మృతదేహాన్ని చూసి వారు బోరున విలపించారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని తెలిపారు. పరిష్కారం కాని సమస్య ఉంటే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియ జేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 88 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఎక్కువగా రీసర్వే, భూ వివాదాలు, ఉపాధి అవకాశాలు, పౌరసరఫరాల సేవలు, ఇళ్ల పట్టాలు, గృహాల మంజూరు, పింఛన్లు తదితర వాటిపై వినతులు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో అధికారి హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చెక్‌డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చెక్‌డ్యామ్ స్థలం పరిశీలన

కొమరాడ మండలం బట్టిమనుగివలస గ్రామంలోని వనకబడిగెడ్డవాగుపై నిర్మించనున్న చెక్‌డ్యామ్ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. దీని నిర్మాణం పూర్తయితే సుమారు 410 ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. ఇందుకు రూ. పది లక్షలు వెచ్చిస్తే చాలని తెలిపారు. ఆయకట్టు ద్వారా అధిక దిగుబడి, రాబడి వచ్చే పంటల నమూనాలపై రైతులతో కలెక్టర్ చర్చించారు. డివిజన్ నీటిపారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.అప్పలనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పది తర్వాత..
- ఇంటర్‌కు చెక్కుచెదరని ప్రాధాన్యం
- ట్రిపుల్ ఐటీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌లోనూ అవకాశం

6 లో

భగ్గుమంటున్న బంగారం
- ధరలు చూసి బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు
- అక్షయ తృతీయ అమ్మకాలపై సందిగ్ధత


6 లో

కురిసింది వాన
- ఉపశమనం పొందిన జిల్లా వాసులు

8 లో



పది తర్వాత..



తొమ్మిదో తరగతి వరకు ఏదోలా చదివేశారు. పదో తరగతి అలా కాదు.. పబ్లిక్. ఇది కాస్త మంచి మార్కులతో గట్టెక్కితే సూపర్‌రా బాబూ.. అనే వారు నిన్నటి తరం. ఇప్పుడు అలా కాదు. పదో తరగతి తర్వాతే అత్యంత కీలకమని చెబుతున్నారు నేటి తరం. పిల్లల ఆసక్తిని గమనించి, వారు ఏ సబ్జెక్ట్‌లో ప్రతిభ కన్పిస్తున్నారో గుర్తించి ముందుకు నడిపిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. పదో తరగతి వరకు ఎన్ని కోర్సులు అందుబాటులోకి వస్తున్నా, ఇంటర్మీడియట్‌కు ఉన్న ప్రాధాన్యం చెక్కు చెదరలేదనే చెప్పాలి.

- ఇంటర్మీడియట్‌కు చెక్కుచెదరని ప్రాధాన్యం
- ట్రిపుల్ ఐటీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌లోనూ అవకాశం
- విద్యార్థుల ఆసక్తే ప్రధానమంటున్న విద్యావేత్తలు

విజయనగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

పదో తరగతి వరకు ఏ పాఠశాలలో చదివినా, ఆ తర్వాత మాత్రం ఏ కోర్సుల్లో, ఎక్కడ చేర్చాలో ఆచితూచి అడుగువేయాలి. ఇంటర్మీడియట్ ఎక్కడ చదివిస్తే మంచిదో అనే ఆలోచనతో చాలామంది తల్లిదండ్రులు ఉన్నారు. ఎక్కడ చదివించినా, ఏ కోర్సు చదివించినా పిల్లల ఆసక్తిని తెలుసుకోవడం మాత్రం మరిచిపోరాదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు అందుబాటులో ఉన్న కోర్సుల్లో చేర్పడమే తప్ప, దూరంలో ఉన్న మంచి కోర్సుల్లో జాయిన్ చేద్దామన్న ఆలోచన చేయడం లేదు. తద్వారా వారి పిల్లలు బంగారు భవితను కోల్పోతున్నారు. అంతా అయిన తర్వాత సరైన కళాశాలలో చదివించలేదని బాధపడేకన్నా, ముందుగానే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతోనే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థుల ఆసక్తి మేరకే..

పదో తరగతి తర్వాత చదువుల ఎంపికలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థుల ఆసక్తి మేరకు ఎంపిక చేసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లల ఆలోచనలు, ఉపాధ్యాయుల సలహాలు తీసుకుని నిర్ణయం తీసుకోవడం మంచిది. నలుగుర్నీ సంప్రదించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే పిల్లల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

ఇంటర్మీడియట్‌లో ఇవీ గ్రూపులు..

- **ఎంపీసీ:** ఈ గ్రూపులో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరే విద్యార్థులకు గణితం పట్ల అమితమైన ఆసక్తి ఉంటే రాణిస్తారు. ఆ తర్వాత ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరి ఉన్నతంగా స్థిరపడేందుకు అవకాశముంది.
- **బైపీసీ:** ఈ గ్రూపులో వృక్ష, జంతు, భౌతిక, రసాయన శాస్త్రాలు ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరి శ్రద్ధగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుంది. ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపడం ద్వారా ఎంబీబీఎస్, బీవీఎస్సీ, ఏజీ బీఎస్సీ తదితర కోర్సుల్లో సీటు పొందొచ్చు.
- **సీఈసీ:** ఈ గ్రూపులో కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ ప్రధాన సబ్జెక్టులు. ఈ గ్రూపులో చేరిన విద్యార్థులు భవిష్యత్‌లో సీఏలో చేరి ఆడిటర్లుగా స్థిరపడవచ్చు. ఇటీవల బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు వస్తుండడంతో వాటిని అందిపుచ్చుకోవచ్చు.
- **హెచ్ఈసీ:** హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులతో కూడిన ఈ గ్రూపులో చేరి అసాధారణ ప్రతిభ చూపితే మంచి ఉద్యోగాలు పొందొచ్చు. ఏపీపీఎస్సీ, సివిల్స్ మెయిన్స్‌కు ఈ సబ్జెక్టులే కీలకం కానున్నాయి. చాలామంది సైన్స్ గ్రూపులతో చదివిన వారు కూడా ఈ సబ్జెక్టులతోనే ఏపీపీఎస్సీ, సివిల్స్‌లో ఎంపికైన సందర్భాలు ఉన్నాయి.

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో..

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో ప్రవేశం కోసం పదో పరీక్ష రాయాల్సి ఉంటుంది. తాటిపూడి (బాలికలు, విజయనగరం), నాగార్జునసాగర్ (బాలురు, గుంటూరు), వెంకటగిరి (బాలురు, నెల్లూరు), నిమ్మకూరు (కో ఎడ్యుకేషన్, కృష్ణా జిల్లా)లో గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో సీటు వస్తే భవితకు బంగారు బాట పడినట్టేనన్న అభిప్రాయం ఉంది.

ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే..

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ (ఆర్కే వ్యాలీ)లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఇది ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు. సాధారణంగా పదో తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ప్రాప్తికి సీట్లను కేటాయిస్తారు. ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే అటు నుంచి అటే బహుళ జాతి కంపెనీల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సంపాదించవచ్చు.



ఐటీఐ కోర్సులు..

పదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు అవసరం లేకుండా స్వయం ఉపాధి ఏర్పాటుకు, పరిశ్రమల్లో, రైల్వే తదితర రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఈ కోర్సులు బాగా ఉపయోగపడతాయి. ఫిట్టర్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఐటీఐలు ఈ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. పరిశ్రమల్లో చాలామంది ఐటీఐ చదివిన అభ్యర్థులు స్థిరపడుతున్నారు.

ఇంటర్‌లో వృత్తివిద్యా కోర్సులు..

వృత్తి విద్యా కోర్సుల వల్ల ప్రయోజనం ఎక్కువే. వెటర్నరీ, అగ్రికల్చరల్, రేడియో అండ్ టీవీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ, బిజినెస్ మేనేజ్‌మెంటు, పారా మెడికల్, ఏఎన్ఎం, లేబ్ టెక్నీషియన్, కేటరింగ్, డెయిరీ, ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వం నియామకాలు చేపట్టిన సచివాలయం ఉద్యోగాల్లో చాలామంది వృత్తి విద్యా కోర్సులు చదివిన వారు ఎంపికయ్యారు. ఇటీవల ఈ కోర్సులు చదివే వారి సంఖ్య పెరిగింది.







వ్యవసాయ కోర్సులు..

వ్యవసాయ కోర్సులకు భలే గిరాకీ ఉంది. డిప్లొమో ఇన్ అగ్రికల్చల్, వెటర్నరీ, హార్టికల్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తిచేసిన వారు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో, విత్తనోత్పత్తి కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. ప్రభుత్వ పరంగా వ్యవసాయశాఖలో ఏఈవోలు, ఆత్మ ప్రాజెక్ట్‌లో ఉద్యోగాలు సాధించవచ్చు.

రెండేళ్ల కోర్సులూ ఉన్నాయి..



విద్యార్థులు రెండేళ్లలో తమ కాళ్లమీద నిలువగలిగేందుకు వృత్తి విద్యాకోర్సు తోడ్పడుతుంది. పారా మెడికల్, అగ్రికల్చర్, ఫిషరీస్ కోర్సులు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్లలో వివిధ కోర్సులు పూర్తి చేయవచ్చు. అలాగే ఎంపీసీ, బైపీసీ కూడా చదువుకోవచ్చు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అవగాహన మేరకు నిర్ణయం తీసుకోవాలి.

-ఎస్‌వీ సన్యాసిరావు, అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గజపతినగరం

ఒకేషనల్ కోర్సులతో ఉపాధి..



గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పది పాసైన తరువాత ఒకేషనల్ కోర్సులు చదివితే తొందరగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిసాయి. ఇంటర్, డిగ్రీ చదివే లోపు వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేస్తే తొందరగా నిలదొక్కుకోవచ్చు. అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వివిధ విభాగాల్లో తొందరగా మెలకువలు నేర్చుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.

-మజ్జి సత్యన్నారాయణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లిమర్ల

పాలిటెక్నిక్ కోర్సులు..

పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యలో చేరాలన్న ఆసక్తి ఉంటే పాలిసెట్‌ను రాయాలి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే దాదాపు అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా పాలిటెక్నిక్ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, కంప్యూటర్స్, కెమికల్, ఆటోమోబైల్ తదితర కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులను పూర్తిచేస్తే పబ్లిక్ మరియు ప్రైవేటు సెక్టార్లలో ఉద్యోగాలు సాధించవచ్చు. అలాగే సొంతంగా కూడా ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈసెట్ రాసి ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చు.



- ధరలు చూసి బెంబేలెత్తిపోతున్న కొనుగోలుదారులు
- రేపు అక్షయ తృతీయకు అమ్మకాలపై సందిగ్ధత
- 45 శాతం వరకు తగ్గవచ్చంటున్న వ్యాపారులు

భగ్గుమంటున్న బంగారం

సాలూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బంగారం ధర భగ్గుమంటున్న తరుణంలో అక్షయ తృతీయ నాడు పుత్తడి కొనుగోలుపై పలువురు తర్జనభర్జన పడుతున్నారు. వైశాఖ శుద్ధ తృతీయ సందర్భంగా ఈ నెల 30న అక్షయ తృతీయ పండగను జరుపుకోనున్నారు. ఆ రోజున ఇష్టదైవాలకు పూజలు చేస్తారు. అనంతరం ఎంతోకొంత పసిడిని కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం బంగారం ధర చుక్కలను తాకింది. 24 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 98,280 ఉంది. 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 89,500 ఉంది. తులం బంగారం ధర రూ.లక్ష దాటడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. గతేడాది అక్షయ తృతీయకు పార్వతీపురం మన్యం జిల్లాలో రూ. 3 కోట్లకు పైబడి పుత్తడి వ్యాపారం సాగింది. ఈ ఏడాది అక్షయ తృతీయకు బంగారం ధర అధికంగా ఉన్న నేపథ్యంలో అమ్మకాలు ఎలా ఉంటాయోనని వ్యాపారులు సందిగ్ధంలో ఉన్నారు. బంగారం ఈ ఏడాదిలో (2025)లోనే అధికంగా ధర పెరగడం విశేషం. గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటికి రూ.17,800లు పెరిగింది. గతేడాది అక్టోబరులో 24 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 80,500 ఉండగా ప్రస్తుతం దానిధర రూ. 98,280 ఉంది. మరోవైపు పెళ్లిబాజాలు మోగుతున్నా పసిడి వ్యాపారం డీలాగా ఉన్నట్టు వ్యాపారులంటున్నారు. ఒక పెళ్లికి అయ్యే ఖర్చులో దాదాపు 37.5 శాతం బంగారం ఆభరణాలకు వెచ్చిస్తారు. ప్రస్తుతం చాలామంది అత్యవసరమైన శతమానం తదితర వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తూ ఆభరణాల విక్రయాలను పరిమితం చేస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడితే బంగారం ధర తగ్గే అవకాశాలున్నాయని పలువురు భావిస్తున్నారు. గత నెల 21 నాటికి పది గ్రామాలు 24 క్యారెట్ల బంగారం రూ. 1,00,015 ఉండగా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం రూ.98,280కు తగ్గింది. ఇంకా తగ్గవచ్చన్న ఉద్దేశంతో కొనుగోలు వాయిదా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్షయ తృతీయ సందర్భంగా బంగారం కొనుగోలు చేయాలనే సెంటిమెంట్ ఉన్నవారు సైతం ఈ ఏడాది పరిమితంగానే కొనుగోలు చేసే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. గతేడాది కన్నా 45 శాతం వరకు అమ్మకాలు తగ్గే అవకాశముందని సాలూరు బంగారం వర్తకుల సంఘం ప్రతినిధి సుతాపల్లి వీరవెంకటరావు తెలిపారు.

ఇవి కొనుగోలు చేస్తే మేలు..

అక్షయ తృతీయ సందర్భంగా బంగారమే కొనుగోలు చేయాలని లేదు. పుత్తడి కొనుగోలు చేసే స్థోమత లేకపోతే పసుపు, గళ్ల ఉప్పు, బెల్లం కొనుగోలు చేసినా మంచిదే. అక్షయ తృతీయ పూజను ఉదయం 6.46 గంటల నుంచి 8.45 గంటల మధ్య చేసుకుంటే శుభకరం.

-ఆర్.పార్థసారథి, రుత్వికుడు

మేమూ అర్హులమే కదా!

- '2003 డిసెంబరుకు ముందు' కూడా పరిగణనలోకి తీసుకోండి
- కలెక్టరుకు విన్నవించుకున్న 'స్పౌజ్ పింఛన్' మహిళలు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

- గంట్యాడ మండలం వసంత గ్రామానికి చెందిన రామయ్యమ్మకు 75 ఏళ్లు. భర్త గుల్లపల్లి సత్యం వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ 2023 అగస్టు 8 తేదీన మృతి చెందారు. ఆమె వితంతు పింఛన్ కోసం 2023 నవంబరు 16న స్థానిక గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే రామయ్యమ్మకు ఇప్పటి వరకూ మంజూరు కాలేదు. దీంతో కలెక్టరేట్ ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు వచ్చారు.
- వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన రావాడ ఎర్రయ్యమ్మ భర్త చినదేముడు 2023 ఏప్రిల్ 19న మృతి చెందారు. ఆమె వితంతు పింఛన్ కోసం స్థానిక గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదు. దీంతో ఈమె కూడా కలెక్టరేట్‌కు వచ్చారు.
- విజయనగరానికి చెందిన బారిపల్లి అప్పలరాములు భర్త సత్యం దేముడు 2023 మే 2 తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె జీవనానికి ఇబ్బంది కలగడంతో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ మంజూరు కాకపోవడంతో కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు.
- బాడంగి మండలం పెదపల్లి గ్రామానికి చెందిన ఆవుల నారాయణమ్మ భర్త సంగమేషి 2023 జూన్ 2న అనారోగ్యంతో మరణించారు. దీంతో నారాయమ్మ వితంతు పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా ఈమెకు కూడా మంజూరు కాలేదు. ఈ పరిస్థితిలో ఆమె కలెక్టరేట్‌లో పింఛన్ మంజూరు చేయాలని కోరారు.
- డెంకాడ మండలం గుణుపూరు గ్రామానికి చెందిన సిరిగుడు మంగమ్మ భర్త పైడితల్లి 2023 ఏప్రిల్ 27న మృతి చెందారు. ఆమె జీవనాధారానికి ఇబ్బంది కలగడంతో సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు భర్త చనిపోయి రెండు సంవత్సరాలు కావస్తున్నా పింఛన్ మంజూరు కాకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చారు.

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇలాంటి వారి సమస్యలు అధికంగా వచ్చాయి. ప్రభుత్వం స్పౌజ్ కోటా పింఛన్ మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు వరకు భర్తలు చనిపోయిన వారికి పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే 2023 డిసెంబరు నెలకు ముందు భర్తలు చనిపోయిన వారి గురించి స్పష్టత ఇవ్వకపోవడంతో అలాంటి వారంతా ఆందోళన చెందుతున్నారు. తమకు కూడా పింఛన్ మంజూరు చేయాలని కలెక్టరు బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తికి వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 188 వినతులు రాగా వీటిలో డీఆర్‌డీఏ పింఛన్ల మంజూరుకు 30వినతులు, రెవెన్యూకు 80, పీఆర్‌కు 15 వినతులు వచ్చాయి. వెంటనే వీటిని పరిష్కరించాలని ఆయాశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టరు అంబేడ్కర్

రైల్వే స్టేషన్‌లో 'జల్ సేవ'

- ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు తాగునీరు సరఫరా

బొబ్బిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు, సిబ్బంది జల్ సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. రైళ్లలో ఉన్న, ప్లాట్‌ఫామ్‌లపై వేచిఉన్న ప్రయాణికులకు గ్లాసులతో తాగునీరు అందజేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నన్ని రోజులు ఈ జలసేవ కొనసాగిస్తామని తెలిపారు.

భద్రతా పరమైన అంశాల పరిశీలన..

ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి పీసీ పండా ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్, జీపీఎఫ్ పోలీసులు స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రతా పరమైన అంశాలను పరిశీలించారు. ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు.సీసీ టీవీల పనితీరును పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టామని తెలిపారు.



ప్రయాణికులకు తాగునీరు అందజేస్తున్న పోలీసు అధికారి

ఈ-వ్యర్థం.. ఇచ్చేద్దాం

- ఉపయోగపడని ఎలక్ట్రానిక్ పరికరాలతో ముప్పు
- మున్సిపాలిటీలలో కలెక్షన్ సెంటర్లు

రాజాం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం గణనీయంగా పెరిగిపోతోంది. దీంతో తయారీదారులు ఎప్పటికప్పుడు కొత్త మోడళ్లలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువుల్ని మార్కెట్లోకి డంప్ చేస్తున్నారు. వినియోగదారులు కూడా పాత వస్తువులకు మంగళం పాడుతూ కొత్త వస్తువులు కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యర్థాల నిల్వలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటివల్ల మానవాళికి ముప్పుతో పాటు పర్యావరణానికి హాని కలిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఒన్స్ యూజ్‌డ్ ప్లాస్టిక్ వ్యర్థాలను, పాలిథిన్ కవర్లను నిషేధించడంతో పాటు ఈ వ్యర్థాల ఏరివేతకు ప్రభుత్వం నడుం బిగించింది. తొలిదశలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో వీటి ఏరివేత దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి ప్రతి మూడో శనివారం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఇందుకు ఉపయోగించుకుంటోంది. జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో ఈ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం ప్రారంభించారు. వీధుల్లోకి వచ్చే పారిశుధ్య కార్మికులకు ఇళ్లల్లో ఉన్న ఈ వ్యర్థాలను అందజేయాలని కలెక్టర్ అంబేడ్కర్ జిల్లా ప్రజలకు ఇప్పటికే సూచించారు.

ఈ-వ్యర్థాలంటే..

పాడైన టీవీలు, టీవీల్లోని మదర్ బోర్డులు, పనిచేయని డెస్క్‌టాప్ కంప్యూటర్లు, వాటిలోని పరికరాలు, కీ బోర్డులు, మౌస్‌లు, మానిటర్లు, ఫోన్లు, సెల్‌ఫోన్లు, పాత కాలం రేడియోలు, టేప్ రికార్డర్లు, ఏసీలు, కూలర్లు, వాటిలోని విడి పరికరాలను ఈ-వేస్ట్ అంటారు. వీటివల్ల ఎలాంటి ప్రయోజనం లేకపోయినా మనకు తెలియకుండానే ఆఫీసులు, ఇళ్లల్లో ఉంచివేడయంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.

వీటినేం చేస్తారంటే..

సేకరించిన ఈ వ్యర్థాలను ఇప్పటికే ఏర్పాటు చేసిన సెంటర్లలో పొందుపరిచి వాటినుంచి ప్రాణాంతక రసాయనాలు, ఖనిజాలను వేరుచేస్తారు. విలువైన లోహాలను వేరుచేసి అవసరమైన వాటిని ఉత్పాదక పునర్వినియోగం, పునరుత్పాదక రంగాలకు తరలిస్తారు. ఈ-వ్యర్థాల సేకరణలో మున్సిపాలిటీలలో కమిషనర్లు, శానిటరీ అధికారులు నిమగ్నమయ్యారు.



రాజాం మున్సిపాలిటీలో ఈవేస్ట్‌పై ప్రచారం చేస్తున్న దృశ్యం

వాటివల్ల కలగనున్న అనర్థాలను వివరిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ-వేస్ట్‌తో అనర్థాలు..

నిరుపయోగ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువుల వల్ల ప్రజారోగ్యంపై దుష్ప్రభావం పడుతుంది. ఈ-వ్యర్థాలు గాలి, నీరు, నేలను విషతుల్యం చేస్తాయి. ఇళ్ల, షాపులు, గిడ్డంగులు, ఇంటి పరిసరాల్లో ఇవి ఉండడం వల్ల వాంతులు రావడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, కండరాల నొప్పి, డయేరియా, తీవ్ర కాలుష్యం, ఊపిరితిత్తులపై చెడు ప్రభావం, భూతాపం పెరగడం, విష వాయువులు విడుదల కావడం, నేలల్లో కలిసి భూసారం క్షీణించడం వంటి అనర్థాలు ఏర్పడతాయి. ప్రజలు స్వచ్ఛందంగానే తమ ఇళ్లల్లో పేరుకుపోయిన ఈ-వేస్ట్‌ను అందజేయాలి.

-డా.గార రవిప్రసాద్, ఎండీ, జనరల్ మెడిసిన్, రాజాం



ఈ వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

కౌన్సిల్ నిబంధనలు పట్టవా?

● చర్చల్లో బయట వ్యక్తుల హవా

● నిరోధించడంలో అధికారుల విఫలం

● ఇదీ.. నెల్లిమర్ల నగర పంచాయతీలో పరిస్థితి

నెల్లిమర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ పాలకవర్గ సమావేశాల్లో నిబంధనలు పట్టించుకోరా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నగర పంచాయతీ సమావేశానికి కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావాలని గట్టిగా చెప్పే నాథుడే కరువయ్యారు. ప్రతి నెలా నిర్వహించే కౌన్సిల్‌కు కేవలం 20 వార్డులకు చెందిన 20 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావాల్సి ఉండగా వారి కుటుంబ సభ్యులు, బంధుగణం కూడా వస్తున్నారు. అజెండాలోని ఏ అంశం చర్చకు వచ్చినా బయట వ్యక్తులు రచ్చ చేస్తున్నారు. అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని చైర్‌పర్సన్ బంగారు సరోజిని గానీ, కమిషనర్ గానీ నిరోధించడంలేదు. గత నెల సమావేశంలో ఇద్దరు బయట వ్యక్తులు చొరబడి చర్చలో రచ్చ చేశారు. ఏ సంబంధం లేని వ్యక్తులు సమావేశంలో పాల్గొంటున్నప్పటికీ బయటకు పంపించే చర్యలు ఎవరూ చేపట్టలేదు. సదరు వ్యక్తుల విపరీత ప్రవర్తన వల్ల గత నెలలో అజెండాలో పొందుపరిచిన రెండు అంశాలు ఆమోదం పొందలేదు. ఇదిలా ఉండగా తాజాగా శుక్రవారం జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్ బంధువులు ఇద్దరు సమావేశానికి హాజరై కుర్చీల్లో దర్జాగా కూర్చున్నారు. అదే సమావేశానికి హాజరైన ఒకటో వార్డు కౌన్సిలర్ కింతాడ కళావతికి కుర్చీ లేకపోవడం మళ్లీ వివాదానికి దారి తీసింది. సభ్యులు కాని వారు సమావేశంలో తిష్ఠ వేయడం ఏంటని కౌన్సిలర్ కళావతి చైర్‌పర్సన్ సరోజినిని నిలదీశారు. దాంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కీలక కౌన్సిల్ సమావేశంలో సభ్యులు కానివారు ఎందుకు వస్తున్నారంటూ కళావతి మరోసారి ప్రశ్నలేవనెత్తడంతో మళ్లీ గందరగోళానికి దారి తీసింది. అప్పటికి కూడా వారిని బయటకు పంపించేందుకు ఇటు చైర్‌పర్సన్, అటు కమిషనర్ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ తరహా వ్యవహారానికి వారు కూడా మద్దతు ఇస్తున్నట్టు తేటతెల్లమైంది.



నెల్లిమర్లలోని నగర పంచాయతీ కార్యాలయం

ఇస్కఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'ఉల్లాకుల'



నీలకంఠేశ్వర యాదవ్

రాజాం ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) ఇస్కఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎస్.రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సనపల నరసింహులు, ఎస్.శ్రీధర రావు, కోశాధికారిగా సత్యంజనేయులు ఎన్నికయ్యారు. వారితో పాటు 55 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూర్యఘర్‌పై అవగాహన

రాజాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకంపై ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్థానిక వస్త్రపురి కాలనీలో సోమవారం అవగాహననిర్వహించారు. ఈఈ సురేష్ బాబు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ నిర్మాణం చేసుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. డీఈఈ ఫణీంద్ర కుమార్, ఏఈ కుమార్ ఉన్నారు.+

ముమ్మరంగా వాహన తనిఖీలు

శృంగవరపుకోట ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) శృంగవరపుకోట-కొత్తవలస రూట్‌లో సోమవారం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉష, స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేశ్ వాహన తనిఖీలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 115 వాహనాలను తనిఖీ చేశారు. వివిధ రకాల లోపాలు కలిగిన 11 వాహనాలపై కేసుల నమోదు, 8 వాహనాలను సీజ్ చేశారు. అలాగే రూ.1.20 లక్షలు జరిమానా విధించారు. సూపరింటెండెంట్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

500 మొక్కల పంపిణీ

జామి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నెయ్యిల వీధికి చెందిన రంభ సన్ని జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కుమార్తెలు సోమవారం 500 మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు పెంచడం ఆయనకు ఇష్టం కావడంతో కుమారుడు రవి, కుమార్తెలు రూప, సత్యవతి వివిధ రకాల మొక్కలను పలువురికి అందజేశారు.

ఆక్రమణలను తొలగించండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మునసబు వీధి మోపాడ కల్లాల్లో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరారు. సోమవారం స్థానికులు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి డీటీ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ 11 సెంట్లు భూమిలో బావిని పూడ్చి భూమిని ఆక్రమిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మోపాడ చిన్నా, కృష్ణ, ఎం.వి.ఎ.నాయుడు, గంగాధర్ ఉన్నారు.

రేపు 'వీఆర్‌ఏల రాయబారం'

వేపాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల రాయబారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు గట్టు వెంకన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన పోక్సో కేసులో తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరంలోని చైతన్య నగరానికి చెందిన నాలం శివకుమార్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.13 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రధాన న్యాయాధికారి కె.నాగమణి సోమవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయనగరంలో నివాసం ఉంటున్న 16 ఏళ్ల బాలికతో నాలం శివకుమార్‌కు టైపు ఇనిస్టిట్యూట్‌లో పరిచయం ఏర్పడింది. శివకుమార్ నగరంలోనే ఉంటూ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నట్లుగా చెప్పి బాలికతో పరిచ యం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. వారికి బాబు పుట్టి న తర్వాత ఆ బాలికను పెళ్లి చేసుకోడానికి నిరాకరించాడు. పైగా కులం పేరుతో దూషించడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ జె.మురళి పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి దిశ మహిళా స్టేషన్ డీఎస్పీ టి.త్రినాథ్ దర్యాప్తు చేసి శివకుమార్‌ను అరెస్టు చేశారు. కేసు ప్రాసి క్యూషన్ పూర్తయ్యేలా వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ చొరవ తీసుకున్నారు. శివకుమార్‌పై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్పీ తెలిపారు.

కళాను కలిసిన మంత్రి కొండపల్లి



కళాతో మాట్లాడుతున్న మంత్రి

రాజాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల ఆయన కంటి శస్త్రచికిత్స చేసుకున్న నేపథ్యంలో యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి కళావెంకటరావును పరామర్శించారు.

పవర్ ప్లాంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

● తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజనులు



ఆందోళన చేస్తున్న గిరిజనులు

వేపాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మారిక గ్రామంలో అదాని పవర్ ప్రాజెక్టు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మారిక గిరిజనులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే వంటవార్పు చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సీపీఎం పోరాటంతో ఇటీవల మారిక గ్రామానికి రహదారి నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీంతో గిరిజనులతో పాటు సీపీఎం కూడా ఆనందం వ్యక్తం చేసిందన్నారు. అంతలోనే మారికలో అదానీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు 214 ఎకరాలను తీసుకున్నట్టు రెవెన్యూ అధికారులు ప్రకటించారన్నారు. రహదారిని గిరిజనుల కోసమే వేస్తున్నారనుకున్నాం కానీ అదానీ పవర్ ప్లాంట్ కోసం వేశారని ఇప్పుడు అర్థమైందన్నారు. గిరిజనుల బతుకుల ఛిద్రం చేస్తే సహించేది లేదన్నారు. ప్రాణాలైన వదులు కుంటాం కాని ప్లాంట్ నిర్మాణాన్ని జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం కార్యదర్శి రాంబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, ఎం.రమణ, గాడి అప్పారావు, కరకవలస సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, చలుమూరి శ్యామ్ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులపై ఆందోళన



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న దళితులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెల్లి గౌరమ్మపేట గ్రామానికి చెందిన ఏడుగురు దళితులకు చెందిన భూముల్లో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. 1985లో ఆర్లీ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబరు 33లో 2.50 ఎకరాలు, 34లో 2.55 ఎకరాలు, మార్లాపల్లి రెవెన్యూలో సర్వేనెంబరు 300లో 5.60 ఎకరాలు గెడ్డ పోరంబోకు భూములను దళితులకు ఇచ్చారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు సాగుచేస్తూ పలు రకాల పంటలు పండించుకొని జీవనోపాధి సాగిస్తున్నామన్నారు. ఎవరో పెద్దల ఒత్తిడితో మా భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతివారికి అప్పజెప్పేందుకు కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే దళితుల భూముల జోలికి పోవద్దని చెప్పినా రెవెన్యూ శాఖాధికారులు పెడ చెవినపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్చరిక బోర్డులు తొలగించాలని కోరుతూ తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

కర్మాగారాన్ని తెరవడం కష్టం



చర్చల్లో మాట్లాడుతున్న యాజమాన్య ప్రతినిధి

కొత్తవలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీలో జిందాల్‌నగర్‌లో జేఎస్‌ఎల్ కర్మాగారంలో లాకౌట్ నేపథ్యంలో యాజమాన్యం, కార్మికసంఘాల మధ్య సోమవారం నిర్వహించిన చర్చలు కొలిక్కిరాలేదు. ప్రస్తుత పరిస్థితులలో కర్మాగారాన్ని తెరవడం కష్టమని యాజమాన్య ప్రతినిధి దినేష్‌శర్మ స్పష్టం చేయడంతో కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. కర్మాగారానికి సంబంధించి ముడు ఉత్పత్తి ధరలు పెరిగిపోవడం, విద్యుత్ చార్జీలకు సంబంధించిన రాయితీలను ప్రభుత్వం ఎత్తి వేయడంతో ఉత్పత్తి వ్యయం పెరిగి కంపెనీ నష్టాల్లోకి వెళ్లిపోయిందన్నారు. కంపెనీ చట్టాల ప్రకారం ముందుకు వెళతామని యాజమాన్యం తెలియజేయడంతో తమ కార్మిక చట్టాలను అనుసరించి న్యాయం కోసం పోరాటం చేస్తామని కార్మికులు చర్చల నుంచి వెళ్లిపోయారు. అనంతరం యాజమాన్య వైఖరికి నిరసనగా కర్మాగార ఆవరణలో ఆందోళన చేశారు. చర్చల్లో వైసీపీ ట్రేడ్‌యూనియన్ తరపున ఉత్తరాపల్లి సర్పంచ్ సింగంపల్లి గణష్, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, సీఐటీయూ నుంచి తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు, టీడీపీ యూనియన్ నుంచి పిల్లా అప్పలరాజు, నాయకులు సలాది భీమయ్య, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: ఎస్పీ



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 39 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యలను జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐ లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

కొత్తవలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం మహిళలకు కుట్టు మిషన్లను ఆమె పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి మొదటి విడతగా 140 కుట్టు మిషన్లు వచ్చాయన్నారు. వీరందరికి టైలరింగ్ శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఎం జనార్దన్, నాయకులు కోళ్ల వెంకటరమణ, పీవీ రత్నాజీ, కొరుపోలు అప్పారావు, లెంకశ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం అభినందించారు. కొట్యాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెదిరెడ్ల భాగ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. పది పరీక్షల్లో 592 మార్కులు సాధించి జిల్లాలో రెండోస్థానం, నియోజకవర్గంలో మొదటి స్థానం సంపాదించడంపై ప్రశంసించారు. జమ్మాదేవిపేట ఎంజేపీ పాఠశాలకు చెందని పది మంది విద్యార్థులు 580 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల పేరు నిలబెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో, కొట్యాడ హైస్కూల్ హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేందాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గజపతినగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మహిళలకు నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీమణి లక్ష్మీసింధుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, బీసీ కార్పొరేషన్ ఏఈవో రమణమ్మ, ఎంపీడీవో బి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మే 1 నుంచి మే 31 వరకు వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. క్రీడా శిబిరంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పౌష్టికాహారంగా పాలు, గుడ్డ, నిమ్మరసం, గ్లూకోజ్ అందిస్తామన్నారు. వీటికి మిత్రులు సహకారం అందిస్తున్నారన్నారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు బ్యాడ్మింటన్ శిక్షణ ఉంటుందన్నారు. చీఫ్ కోచ్, ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, కోచ్‌లుగా మహమ్మద్ అస్లాం వ్యవహరిస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ సుధారాజు, వెంకటరావు పాల్గొన్నారు.

సర్పంచ్ నియామకం రద్దు

దత్తిరాజేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటీవల పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాసు మరణంతో ఆయన స్థానంలో ఉప సర్పంచ్ ఆదినారాయణను సర్పంచ్‌గా నియమించారు. కాగా, సర్పంచ్‌గా నియామక ఉత్తర్వులు నిలుపుదల చేస్తున్నట్టు ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రకటనలో వెల్లడించారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

ఆత్మహత్యలే శరణ్యం

● ఉద్యోగాల తొలగింపు ఉత్తర్వులను తిరస్కరించిన షిఫ్టు ఆపరేటర్లు

● పుర్రేయవలస సబ్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యకు విఫలయత్నం



నియామక పత్రాలు చూపిస్తున్న షిఫ్టు ఆపరేటర్లు

చీపురుపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల నుంచి తీసివేస్తే ఆత్మహత్యలే శరణ్యమని పుర్రేయవలస విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చెందిన షిఫ్టు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు తొలగింపునకు సంబంధించిన ఉత్తర్వులను తీసుకోవడానికి వారు సోమవారం తిరస్కరించారు. ఈ క్రమంలోనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు విఫలయత్నం చేశారు. అధికారులు, గ్రామ పెద్దలు సర్ది చెప్పడంతో వ్యవహారం సద్దుమణిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పుర్రేయ వలసలో 2024 మార్చి 15న విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన మీసాల బాలజీ, ఎస్.సురేష్, రెడ్డి సతీష్, పల్లి సూర్యనారాయణలను 2024 ఏప్రిల్ 15న షిఫ్టు ఆపరేటర్లుగా నియమించారు. ఎన్నికలు రావడంతో, వీరి వేతనాలు మంజూరు కాలేదు. అనంతరం, ప్రభుత్వం మారిపోవడంతో వీరి వేతనాల మంజూరు వివాదాస్పదమైంది. దీంతో కార్మిక శాఖకు వీరు ఫిర్యాదు చేయడంతో డీసీ సమక్షంలో చర్చలు జరిగాయి. సంబంధిత కాంట్రాక్టరు, ఈపీడీసీఎల్ డీఈలు కూడా చర్చలకు హాజరయ్యారు. అయినప్పటికీ ఏడాది గడిచినా వేతనాలు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో వీరిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు అందజేయడానికి ఏడీ రమణ, ఏఈ ప్రభాకరరావు సోమవారం రావడంతో సబ్ స్టేషన్ వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో నలుగురు షిఫ్టు ఆపరేటర్లు పురుగుమందు తాగడానికి చేసిన ప్రయత్నాన్ని అధికారులు, నాయకులు అడ్డుకున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ అధికారులను సబ్ స్టేషన్‌లోకి వెళ్లనీయబోమని తేల్చి చెప్పడంతో సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు వెనుదిరిగారు.

అమ్మవారి పండగకు వెళ్లి తిరిగి వస్తుండగా..

● లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం



లక్ష్మణరావు (ఫైల్)

గజపతినగరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అత్తవారింటికి పండగకు వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన సోమ వారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ మూలవలసకు చెందిన కొటపర్తి లక్ష్మణరావు(35) మధురవాడకు చెందిన మిత్రుడు మెరుగు బాలాజీతో కలిసి అనంతగిరి మండలంలోని సొట్టాడవలసకు శనివారం సాయంత్రం విశాఖ జిల్లా కొమ్మాది నుంచి ద్విచక్రవాహనంపై వచ్చారు. లక్ష్మణరావు అత్తవారి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పండగలో వారు పాల్గొన్నారు. సోమవారం తెల్లవారు జామున తిరిగి కొమ్మాది వెళ్లేందుకు బయలుదేరారు. ద్విచక్రవాహనంపై వస్తుండగా గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విశాఖ నుంచి రాయిపూర్ వెళ్తున్న బొగ్గులారీ వారిని ఢీ కొట్టింది. 10 మీటర్ల వరకూ బైక్‌ను లారీ ఈడ్చుకెళ్లింది. దాంతో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందారు. మెరుగు బాలాజీకి కాలు విరిగింది. విషయం తెలుసుకున్న గజపతినగరం, బొండపల్లి ఎస్ఐలు కిరణ్ కుమార్ నాయుడు, మహేశ్ ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా ముగించి జిల్లా కేంద్ర ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన బాలాజీ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూలవలసకు చెందిన లక్ష్మణరావు తన అక్క కూతురు రమ్యను ఆరేళ్ల కిందట వివాహం చేసుకుని ఇల్లరికం ఉంటున్నాడు. గ్రామంలో పనులు లేకపోవడంతో విశాఖలో ప్లంబింగ్ పనులు చేస్తూ కొమ్మాదిలో నివాసం ఉంటున్నాడు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తి మృతి

కొత్తవలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి : మండలంలోని కంటకాపల్లి పంచాయతీ శారదా కర్మాగారం ఎదుట్న కొత్తవలస- విజయనగరం రోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు సీఐ షన్ముఖరావు తెలిపారు. సోమవారం ఉదయం వేకువజామున ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందన్నారు. కంటకాపల్లి వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పందిరప్పన్న కూడలిలో సోమవారం వాహన తనీఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆరు కేజీల గంజాయితో పట్టుబడ్డారు. శృంగవరపుకోట పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరూ ఒడిశాకు చెందినవారుగా గుర్తించారు. సీఐ నారాయణమూర్తి వారిపై కేసు నమోదు చేశారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

నెల్లిమర్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు తెలిపారు. మండలంలోని పెనుబరిలో నిర్వహించిన దాడుల్లో సామాదుల రాము ఆరు మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు. దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్‌సీలు వి.కృష్ణ, ఎం.అప్పారావు, ఈసీలు సీహెచ్.సంతోష్‌కుమార్, డి.కె.శంకరరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల హత్య కేసులో కొడుకు అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ మండలంలో తల్లిదండ్రులను హత్య చేసిన కొడుకును సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు ఆ వివరాలను వెల్లడించారు. పూసపాటిరేగ మండలం చల్లవానితోటకు చెందిన పొంద్రంకి అప్పలనాయడు, జయమ్మ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రాధకుమారికి వివాహ సమయంలో తండ్రి అప్పలనాయడు 20 సెంట్లు భూమిని రాసిచ్చారు. ఆ భూమి పోను మరో 70 సెంట్లు తల్లిదండ్రుల పేరిట ఉంది. కుమారుడు రాజశేఖర్‌కు గ్రామంలో రూ.12 లక్షల వరకు అప్పులు ఉండగా సదరు భూమిని అమ్మేందుకు నిత్యం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. ఈ విషయమై పలుమార్లు గ్రామపెద్దల వద్ద పంచాయితీ నడిచింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో తల్లిదండ్రులతో తరచూ రాజశేఖర్ గొడవ పడుతుండేవారు. దాంతో గతేడాది అక్టోబరులో రాజశేఖర్ తల్లిదండ్రులతో విడిపోయాడు. రెల్లివలసలో అద్దెకు ఉంటున్నాడు. రాజశేఖర్ రైతు భరోసా కోసం దరఖాస్తు చేయాలని భావించి భూముల వివరాలను తనిఖీ చేయించాడు. 70 సెంట్లకు బదులు 40 సెంట్లు ఉన్నట్టు గుర్తించాడు. మిగిలిన 30 సెంట్లు 2024లో తన సోదరి రాధకుమారి పేరున రిజిస్ట్రేషన్ అయిందని తెలుసుకున్నాడు. ఈ విషయంపై మరోసారి గ్రామపెద్దలతో పంచాయితీ చేయించాడు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సోదరి పేరుతో ఉన్న భూమిని చదును చేస్తే పరిష్కారం అవుతుందని భావించాడు. ఈ నెల 26న ట్రాక్టర్‌తో కొంత మట్టిని పొలానికి వెళ్లే దారిలో వేయించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులకు పొలంలోకి వెళ్లి రాజశేఖర్‌తో గొడవపడ్డారు. దాంతో ఆగ్రహానికి గురైన రాజశేఖర్ ట్రాక్టరుతో ఢీ కొట్టి తొక్కి చంపి పరారయ్యాడు. సోదరి రాధకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. సోమవారం చోడమ్మ అగ్రహారం జంక్షన్‌లో రాజశేఖర్‌ను అరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కేసును చాకచక్యంగా చేధించిన సీఐ రామకృష్ణ, ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బందిని అభినందించారు.

పిచ్చి కుక్క దాడి: ఏడుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

దత్తిరాజేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తి గ్రామంలో సోమవారం పిచ్చి కుక్క ఏడుగురిపై దాడి చేసింది. దాంతో వారు గాయాల పాలయ్యారు. స్థానికులు స్పందించి బాధితులను పీహెచ్‌సీకి తరలించారు. గాయాలైన వారిలో జె.రాజేశ్వరి, సీహెచ్.చిన్నమ్మి, తాడ్డి బంగారమ్మ, పి.రమ, జి.అప్పలనాయుడు, టి.సన్యాసప్పడు, టి.రత్నకుమారి ఉన్నారు. వీరికి పీహెచ్‌సీలో వైద్యులు వైద్యం అందిస్తున్నారు. వీరిలో తాడ్డి బంగారమ్మ, పి.రమ పరిస్థితి విషమించడంతో గజపతినగరం సీహెచ్‌సీకి తరలించినట్టు వైద్యాధికారి సతీశ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

విజయనగరం (రింగురోడ్డు) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.జి.రాఫెల్ అన్నారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని యాజమాన్యానికి వినతిప్రతాలు అందజేసినప్పటికీ స్పందించకపోవడంతో ధర్నా చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుజాత, ప్రసాద్, బి.రామారావు, చంద్రమౌళి, రమణమ్మ, కుమారి, జెజె రావు, శివాజీ, కె.ఇ.రావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సోమ వారం ఎన్ఎంయూ ఆందోళన చేసింది. అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలన్నారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్స్‌ను ఇవ్వాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలన్నారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిహారం కోసం ఎదురుచూపు

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ మేరకు రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో నిండిపోతున్న 44 ఎకరాలను అదనంగా సేకరించారు. పరిహారం కింద రూ.6 కోట్లు చెల్లిస్తామని అప్పట్లో వారు మాట ఇచ్చారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీన్ మారింది. 2020లో విచారణ అయినప్పటికీ ఇప్పటివరకు నష్ట పరిహారం మాత్రం రైతులకు అందలేదు. అధికారులు సేకరించిన 44 ఎకరాలు ఆక్రమణకు గురవుతా యనే భయంతో కొందరు సుమారు 40 ఎకరాల్లో ఏటా వరి, పత్తి సాగు చేస్తున్నారు. అయితే వర్షాకాలంలో రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌తో ఆయా పంటలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతులు మరింత అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీనిపై గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వానికి మొరపెట్టు కున్నా ఫలితం లేకపోయింది. జిల్లా పునర్విభజనలో పార్వతీపురం మన్యం లో భామిని చేరింది. వంశధార ప్రాజెక్టు శ్రీకాకుళం జిల్లాలో ఉంది. ఈ పరిహారం కోసం పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లు, వంశధార అధికారుల చుట్టూ తిరిగి వారు విసిగెత్తిపోయారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారం

గతంలో హిరమండలం రిజర్వాయర్ భూ సేకరణలో నాలుగు ఎకరా లను కోల్పోయా. అరకొరగా చెల్లించిన పరిహారంతో బురుజోల గ్రామంలో 3.30 ఎకరాల పల్లం భూమిని కొనుగోలు చేశా. వ్యవసాయం చేసుకోవాలని ఆశ పడ్డా. అయితే ఆ భూమి కూడా సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కలిసిపోవడం బతుకు భారంగా మారింది. చేతిలో చిల్లిగవ్వలేదు. నష్టపరి హారం అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది.

- మడపన్న తులసి, బురుజోల

ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలి

సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వల్ల తొమ్మిది ఎకరాలను కోల్పోయాం. పైసా ఆదాయం లేకపోవడం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాలుగేళ్ల కిందట మా భూమిని తీసుకుంటామని ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది. అయితే ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. నష్టపరిహారం కోసం ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలో అర్థం కావడం లేదు.

- బి.శాంత్రో, రైతు

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికిల్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్‌లో ప్రవేశాలకు ఆసక్తి గల షెడ్యూల్ తెగ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 24వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. అభ్యర్థులు తమ నమోదు యూనిక్ నెంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ దగ్గరలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని ఆమోదించుకోవాలని సూచించారు. అలా చేసుకున్న వారి పేర్లు మాత్రమే అర్హుల జాబితాలో పొందుపరుస్తారని చెప్పారు. మెరిట్‌లిస్ట్‌లో ఉన్న వారికి కేటాయించిన తేదీ ప్రకారం మొదటి విడత కౌన్సెలింగ్ సాలూరు ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తా రని చెప్పారు. నమోదు, అప్రూవల్ చేసుకోవడానికి ఆఖరు తేదీ మే 26 వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 7569062449, 93900 63882 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భద్రగిరిలో..

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణా సంస్థలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐలో సీట్లు కోసం ఈనెల 28 నుంచి మే 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రీషియన్‌లో 20 సీట్లు, ఫిట్టర్‌లో 20, కంప్యూటర్ అప్లికేషన్‌లో 48 సీట్లు, వెల్డర్ గ్రూప్‌లో 20, డ్రెస్ మేకింగ్ గ్రూప్‌లో 40 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న 2 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని వెంపలగూడ, రాజుగారిగూడ గ్రామాల్లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలలో రెండు కార్యకర్తల పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నా రు. వీటిలో రాజుగారిగూడలోని అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో ఆ పోస్టు భర్తీ నిలుపుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందిస్తామని పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పార్వతీ, సీడీపీవో రంగలక్ష్మి, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిలిపివేతపై ఆందోళన

పాచిపెంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తుండగా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ మధ్యలో నిలిపివేశారంటూ సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద కుడుమూరు గ్రామస్థులు ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీవో బీవీజీ పాత్రోకు గిరిజన సంఘం నాయకు లు సూకురు అప్పలస్వామి, కొర్రా కళ్యాణ్, సుర్రు రామారావులు వినతిప త్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కుడుమూరు రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 42లో ఉపాధి పనులు చేస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరావు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రావివలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

గరుగుబిల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రావివలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గంట వంశీ పనితీరుపై మండల ఉపాధి ఇంజనీరింగ్ అసిస్టెం ట్ గంట అవినాష్, టెక్నికల్ అసిస్టెంట్ కె.నిర్మల సోమవారం అదే గ్రామం లో విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వంశీ తన సొంత పొలంలో నువ్వు పంట కలుపు తీతకు వేతనదారులు ఉప యోగించినట్టు పలువురు తెలిపారన్నారు. అలాగే మస్తర్లలో తేడాలు ఉన్న ట్లు, వేతనదారుల నుంచి రూ.100లు చొప్పున వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం అందిందని తెలిపారు. తగు చర్యలు నిమిత్తం నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు చెప్పారు.

సాగు పట్టాలు ఇవ్వాలి

సాలూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూపు గ్రా మాల గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆయ న ఆదివాసీ గిరిజన సంఘ నేత సూకూరు గంగయ్యతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ ఎన్వీ రమణకు వినతిపత్రం అందించారు.

పద్మాపూర్ సమితిలో గ్రీవెన్స్

ఒడిశా

రాయగడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మాపూర్ సమితిలో కలెక్టర్ పారుల్ పట్వారి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 18 వినతులు అందాయి. వారిలో ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.30వేలు, ఒకరికి రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ.10వేలు అందజేశారు. అదనపు ఎస్పీ అమూల్యకుమార్‌దర్, జిల్లా అభివృద్ధి అధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, పద్మాపూర్ సమితి అధ్యక్షురాలు మణిమాల సబర్ పాల్గొన్నారు.

కెందుగుడ రిజర్వాయర్ పరిశీలన

రాయగడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మాపూర్ సమితి కెందుగుడ బొడేనాల రిజర్వాయర్‌ను కలెక్టర్ పారుల్ పట్వారి సోమవారం సందర్శిం చారు. 930 హెక్టార్ల నీటి పరివాహక ప్రాంతంలో ఉన్న బొడనాల రిజర్వా యర్ ద్వారా సాగవుతున్న పంటల వివరాలను తెలుసుకున్నారు. మా మంగళ మత్స్యకార సంఘం సభ్యులను కలిసి, వారి సమస్యలను తెలుసు కున్నారు. మత్స్య సహకార సంఘ సభ్యులకు మత్స్య శాఖ నుంచి అందజే సే వలలు, బోట్లు, ఐస్ బుట్టలు, మోటర్ బైక్‌లు వంటి వాటిపై ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న ఫిష్ ల్యాండింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు మణిమాల సబర్, జిల్లా మత్స్య శాఖాధికారి జ్ఞానరంజన్ సెఠి, అసిస్టెంట్ ఫిషరీష్ అధికారి అశ్వనీకుమార్ బిశ్వాల్, కెందుగుడ సర్పంచ్ సిద్ధేశ్వర సబర్ పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో వర్షం కురుస్తున్న దృశ్యం



భామినిలో కురుస్తున్న వర్షం

కురిసింది వాన

- ఉపశమనం పొందిన పార్వతీపురం మన్యం జిల్లా వాసులు

పార్వతీపురం/టౌన్/ మక్కువ/ గరుగుబిల్లి/ వీరఘట్టం /భామిని/ సీతంపేట రూరల్/ బలిజి పేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా పార్వతీపురం మన్యం జిల్లా వాసులు ఎండల తీవ్రతతో అవస్థలు పడుతున్నారు. ఈ తరుణంలో సోమవారం సాయంత్రం జిల్లా అంతటా కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే చెట్లు విరిగిపడ్డాయి. రహదారుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాక పోకలకు ఇబ్బంది పడ్డారు. బలిజిపేట వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభం పిడుగుపాటుకు ధ్వంసమైంది.



గరుగుబిల్లి: గొట్టివలస సమీపంలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టు

ఉద్యోగ భద్రత కల్పించాలని..

- సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్‌ఎంయూ సభ్యుల రిలే దీక్ష
- సీహెచ్‌వోల నిరసన



బెలగాం: నిరసన దీక్ష చేస్తున్న సీహెచ్‌వోలు



పాలకొండ: రిలే దీక్షలో పాల్గొన్న ఎన్‌ఎంయూ నాయకులు



పార్వతీపురం టౌన్‌లో..

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగు ల ఉద్యోగ భద్రతకు సంబంధించి సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని ఎన్‌ఎంయూ డిపో సెక్రటరీ కేబీ రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిపో వద్ద రెండు రోజుల రిలే దీక్ష చేపట్టారు. సంఘ నాయకులు పాల్గొన్నారు. ● పాలకొండ: పాలకొండ డిపో దగ్గర నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యం లో రిలే దీక్షా కార్యక్రమం సోమవారం నిర్వ హించారు. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా మాజీ కార్యదర్శి బి.నీలకం ఠం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్, నాయకులు పాల్గొన్నారు. ● బెలగాం: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో)ను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. సీహెచ్‌వోల నాయకుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ

బెలగాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరి ష్కారంలో అలసత్వం లేకుండా త్వరితగతిన పరిష్కరిం చాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవా రం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యం లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. మొత్తం 10 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. త్వరితగతిన ఫిర్యాదులు పరి ష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.



బెలగాం: ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



సీతంపేటరూరల్: వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జిల్లా గ్రీవెన్‌లో.

పార్వతీపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్ట రేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పలువు రు వినతిపత్రాలు సమర్పించారు. బాలగుడబ గ్రామం లోని లంకెల చెరువు ఆక్రమణదారులపై చర్యలు చేప ట్టాలని సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.అప్పారావు వినతిపత్రం అందజేశారు. కురుపాం మండలం లండగొల్లిగూడ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఇందిరమ్మ వినతిపత్రం అందించారు. గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి, వండిడి గ్రామాలకు ఆశ వర్కర్ పోస్టును భర్తీ చేయాలని కోరుతూ కె.రవి వినతిపత్రం అందజేశారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 33 వినతులు

సీతంపేట రూరల్,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరష్కార వేదికకు 33 వినతులు వచ్చాయి. వితంతు పింఛన్ ఇప్పించాలని మెలియాపుట్టి మండలం గొడ్డ గ్రామానికి చెందిన పెద్దింటి పోలమ్మ కోరింది. ఎగువ దొండమానుగూడ గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు పీవోను కోరారు. చాపరాయిగూడ గ్రామంలో సీసీ రహదారి నిర్మించాలని ఆరిక ఎల్లారు కోరగా ఎగువసంకిలి గ్రామంలో వరదగోడ నిర్మించాలని సవర నరేష్ కోరారు. ఇలా అనేక సమస్యలు పరిష్కారం కోరుతూ గిరిజనులు పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించారు. పీజీఆర్ఎస్‌లో పీవోతో పాటు ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ రమాదేవి, ఏఎంవో కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు పంపిణీ చేయండి

బెలగాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఆల్‌మికో సహకారంతో అందిస్తున్న ఉపకరణాలను పంపిణీ చేయాలని జిల్లా దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లాలోని దివ్యాంగులు సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాల యంలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశా రు. ఈసందర్భంగా దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి నాయకులు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, సమస్య ల పరిష్కారం కోసం సహాయకుల సంచాలకుల కార్యాల యం లేదని, వెంటనే ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలిన వినతి

జియ్యమ్మవలస, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండల తహసీల్దార్ కార్యాలయం సోమవారం ధర్నాతో దద్దరిల్లింది. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సాంబ మూర్తి ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కారానికి గిరిజనులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమస్యలను ఏకరువు పెట్టారు. కొమరాడ మండలంలో అనేక గిరిజన గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని,చాలా చోట్ల చెక్‌డ్యాములు పాడైపోయాయని, భూసమ స్యలపై దృష్టి సారించాలని, పలు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, అలాగే పది వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై మండల తహసీల్దార్ ఎ.సాయి కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు

ఆదివాసీలకు న్యాయం చేయాలి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదివా సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని జేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విలేకర్లతో వారు మాట్లాడారు. జీవో నెం.3 స్థానంలో కొత్త జీవోను ఏర్పాటు చేసి ఆదివాసీలకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకో వాలని, ఐటీడీఏ పరిధిలో గల డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టు లు శతశాతం గిరిజనులకే ఇవ్వాలని కోరారు. ఏజేఏసీ ఉపాధ్యక్షుడు సవర చిరంజీవులు, కార్యదర్శులు ఉన్నారు.

సారా స్వాధీనం

పాలకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓని గ్రామంలో సోమవారం పాలకొండకు చెందిన ఇసాయి సోమేషన్‌ను 8 లీటర్ల సారాతో పట్టుకుని, అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు. గొట్ట మంగళాపురానికి చెందిన పరారీలో ఉన్న కోమటిప ల్లి చిన్నారావును, వీరఘట్టం రెల్లివీధికి చెందిన మీసాల చంటిని, హుస్సేన్‌పురానికి చెందిన సిరిపురపు రమేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు.

పండగలోపు పనులు పూర్తి కావాల్సిందే..

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరిన కౌన్సిలర్లు

సాలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి పండగలోగా అభివృద్ధి పనులు పూర్తి కావాల్సిందేనని మున్సిపల్ చైర్మన్ పువ్వల ఈశ్వరమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థాని క మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది ఎజెండాలోని అంశా లను చదివి వినిపించారు. ప్రభుత్వం రెండు కోట్ల రూపా యలను రీయంబర్స్‌మెంట్ పద్ధతిపై విడుదల చేసిన గ్రాంటుకు సంబంధించి 81 అభివృద్ధి పనులను చేయుట కు కౌన్సిల్ తీర్మానం చేసింది. అయితే రక్షిత తాగునీటి పథకాలు, విద్యుత్, పారిశుధ్యం, సాముహిక మరుగుదొ డ్లు, పార్కుల అభివృద్ధి మొత్తంగా ఈ పనులన్నింటినీ మేనెలలో నిర్వహించనున్న గ్రామదేవత పండుగలోగా పూర్తి చేయాలని పాలక వర్గం కోరింది. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పండగ సందర్భంగా సాలూరు ఏరియా ఆసుపత్రి విభాగంలో స్పెషల్ శానిటేషన్ చేసేందుకు పది రోజులకు రూ.4లక్షలు ఖర్చు అవుతుందని ఆ డబ్బులను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ అధికారులు తీర్మానం ద్వారా కోరా రు. అందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. పండగ నేపథ్యంలో మొబైల్ టాయిలెట్స్ నిర్మాణం కోసం సుమా రు రూ.5 లక్షల వ్యయం అవుతుందని, వాటిని సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం తీర్మాణం కోరగా ఆమోదం తెలిపారు. డస్ట్‌బిన్లతో పాటు ఒక సంవత్సర కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసేందుకు డ్రైవర్లు, క్లీనర్లను నియమించి రూ.17లక్షల 60వేల సాధారణ నిధుల నుంచి వారికి చెల్లించు టకు కౌన్సిల్ ఆమోదం కోసం పెట్టగా ఆమోదం తెలిపారు. మూలకు చేరిన కాంపాక్టర్, ట్రాక్టర్లు, పుష్‌కార్టులు, పలు యంత్రాలను రిపేరు చేసేందుకు రూ.12లక్షల 90వేలతో ఆమోదం తెలిపారు. తమ వార్డులో దోమలను నియంత్రిం చడం లేదని 26వ వార్డు కౌన్సిలర్ సన్యాసమ్మ ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డీటీ వి.కృష్ణారావు తో పాటు పలువురు అధికారులు, కౌన్సిలర్ పాల్గొన్నారు.

భూములు అప్పగించే వరకూ పోరాడుతాం

భామిని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసిన డీపట్టా భూములను పెత్తందారుల కబ్జా నుంచి విముక్తి కల్పించి లివిరి దళితులకు అందజేసేవరకు వారి పక్షాన పోరాడుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు అన్నారు. కబ్జాలో ఉన్న భూములను సర్వే చేస్తామని సమాచారం అందజేసిన రెవెన్యూ సిబ్బంది రాకపోవడంతో సోమవారం లివిరి గ్రామంలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వారితో పాటు సీపీఐ నాయకులు ఉన్నారు.

ఘనంగా యర్రకంచమ్మ ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్ర ఇలవేల్పు ఇప్పల పోలమ్మ చెల్లెలు, జగన్నాథపురం ప్రజల ఇలవేల్పు యర్రకంచ మ్మతల్లిని ఊరిలోకి తీసుకువచ్చారు. సోమవారం రాత్రి జగన్నాథపురంలోని నాయుడు నాగభూషణరావు ఇంటి వద్ద అమ్మవారి పాలజంగిడికి ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి పాలజంగిడిని మేళాతాళాల మధ్య జగన్నాథపుర వీధుల్లో ఊరేగించారు. ప్రధాన ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్ బాక్స్

శ్రీకాకుళం అసిస్టెంట్ కలెక్టర్‌గా కురుపాం వాసి



పృథ్వీరాజ్ కుమార్

కురుపాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండల కేంద్రానికి చెందిన దొనక పృథ్వీరాజ్ కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పార్వతీపురంలో ఎంఈవోగా పనిచేస్తున్న కురుపాం గ్రామానికి చెందిన దొనక విజయకుమార్ కుమారుడు పృథ్వీరాజ్. ఈయన 2024 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కురుపాం రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట సర్కిల్ నీలకంఠాపురం పోలీ స్‌స్టేషన్ పరిధిలోని పేదలకు ఎస్పీ మాధవ రెడ్డి సోమవారం దుప్పట్లు, గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం నీలకంఠాపురం పోలీసులు నిర్వహించిన మెగా క్రికెట్ టోర్న మెంట్ ఫైనల్ విజేతలకు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు.

నైతిక విజయం మాదే

పాలకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. వైసీపీతో గెలిచిన కౌన్సిలర్‌ను అడ్డదారిలో చైర్‌పర్సన్‌గా చేసి గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మాట్లాడుతూ నిరంకుశత్వ పాలనకు ఈ ఎన్నిక నిదర్శనమన్నారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

399 పింఛన్ల మంజూరు

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గానికి 399 పింఛన్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కురుపాం నియో జకవర్గానికి 399 వితంతు పింఛన్లు మంజూరు చేసినట్టు ఆమె చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలానికి 63, గరుగుబిల్లి మండలానికి 86, కొమరాడ మండలానికి 66, జీఎంవలస మండలానికి 122 మండలానికి 51 చొప్పున పింఛన్లు మంజూర య్యాయి. మే 1వ తేదీ నుంచి ఈ పింఛన్లను పంపిణీ చేయనున్నారని చెప్పారు.

తహసీల్దార్‌పై ఫిర్యాదు

కురుపాం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కురుపాం తహసీల్దార్ తీరుపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ శెట్టి పద్మావతి తెలిపారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తహసీల్దార్ మ్యుటేషన్లకు రైతుల వద్ద నుంచి అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. పంట నష్ట పోయిన రైతులకు సంతకం పెట్టడంలో ఇబ్బంది కలిగిస్తున్నారని తెలిపారు.

రేపు వీఆర్‌ఏ సమస్యలపై ధర్నా

కురుపాం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏ సమస్యలపై ఈనెల 30న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు తెలిపారు. ముందస్తుగా కురుపాం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందించామన్నారు. జిల్లా ఉన్న వీఆర్‌ఏలు అందరు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పాలకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి చింతల సంజీవి, కోశాధికారి పి.వేణు డిమాండ్ చేశారు. మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆయన సోమవారం పాలకొండలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.